క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలసిన ఎస్వీయూ వీసీ


ముఖ్యమంత్రికి వినతిపత్రం అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : తిరుమల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన సీఎం చంద్రబాబు నాయుడును శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వం నుంచి రావాల్సిన అడిషనల్ బడ్జెట్, ఉద్యోగ విరమణ పొందిన వారికి చెల్లించవలసిన బకాయిల విడుదలపై వినతి పత్రం అందించారు. అనంతరం విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను సైతం అధికారులు కలిసి సమస్యలను విన్నవించారు.

సిద్ధాంతాల సమన్వయంతో పరిశోధనలు


మాట్లాడుతున్న తిరుపతిరావు

తిరుపతి సిటీ : సిద్ధాంతాల సమన్వయంతో పరిశోధనలు చేయాల్సిన అవసరముందని ద్రవిడ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తిరుపతిరావు తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో పీఎం ఉష పథకం కింద ×రీసెంట్ డిసిప్లినరీ ట్రెండ్స్ ఇన్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం వర్సిటీ సావేరీ అతిథిగృహంలో ప్రారంభం అయ్యింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమాజానికి రచనలు మార్గదర్శిగా దోహదపడతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర, డీన్ ఆచార్య విజయలక్ష్మి, ఆచార్య వాణి, కన్వీనర్ శారద, కో–కన్వీనర్ నిర్మల పాల్గొన్నారు.

'సింహగర్జన' వాయిదా


మాట్లాడుతున్న అశోక్‌రత్నం

తిరుపతి కల్చరల్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాయలసీమ మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 23న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో తలపెట్టిన మాలల సింహగర్జన సభను వాయిదా వేస్తున్నట్లు జేఏసీ గౌరవాధ్యక్షుడు అశోక్ రత్నం తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో సభకు పర్మిషన్ రద్దు చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారని, ఈ క్రమంలో గర్జన వాయిదా వేశామని వివరించారు. త్వరలోనే మరో తేదీ ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో నేతలు యనమల రాజ్‌కుమార్, దుగ్గాని జయరామ్, కె.మురళి, సుబ్రమణ్యం, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో క్యాన్సర్‌పై గెలుపు


మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న టాటా ట్రస్ట్ వైద్యులు

తిరుపతి కల్చరల్ : జీవన శైలి మార్పుతో క్యాన్సర్‌పై గెలుపొందవచ్చని టాటా ట్రస్ట్ ప్రతినిధి హేమంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం శివజ్యోతినగర్ రాస్ క్లస్టర్ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బరువు తగ్గడం, జ్వరం, దగ్గు వస్తుండడం, నిరంతర తలనొప్పి, మూత్రనాళంలో రక్తం రావడం, నీరసంగా మారడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం 150 మంది మహిళలకు బీపీ, షుగర్, హైపటైటిస్, నోరు, రొమ్ము, గర్భసంచి సమస్యలకు పరీక్షలు చేపట్టి, మందులు పంపిణీ చేశారు. రాస్ సిబ్బంది బాలాజీ, గీత, క్లస్టర్ లీడర్లు సత్యవతి, స్వరూప, అయేషా పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తి భగత్‌సింగ్


మాట్లాడుతున్న రాఘవ శర్మ

తిరుపతి కల్చరల్ : స్వాతంత్ర్య కోసం ప్రాణాలర్పించిన పోరాటస్ఫూర్తి భగత్‌సింగ్ అని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ 94 వర్ధంతిని పురస్కరించుకొని సంస్మరణ సభ నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, సాహితీవేత్త సాకం నాగరాజు, పౌర చైతన్య వేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఎస్.గోవిందరాజులు ముఖ్యవక్తలుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి ఏఎస్.పరమేశ్వరరావు, సభ్యులు హరీష్, వెంకటసుబ్బయ్య, ఎస్కే అమీనా పాల్గొన్నారు.

షాడో డే



జాతీయ సంస్కృత వర్సిటీ జ్యోతిష్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఈక్వినాక్స్ షాడో డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చాన్సలర్ గోపాలస్వామి, వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకట నారాయణరావు, జ్యోతిష విభాగం హెచ్‌ఓడీ కృష్ణసాద్ రూూ, డాక్టర్ చిత్తరంజన్ నాయక్, పీఆర్ఓ ప్రొఫెసర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ

గ్రాడ్యుయేషన్ డే



మహతి ఆడిటోరియంలో శుక్రవారం ఫ్యూచర్ ఆన్ ప్రీ స్కూల్స్, గ్లోబల్ ఐకాన్ అండ్ ఫ్యూచర్ ఆన్ ప్రీస్కూల్స్ 6వ వార్షికోత్సవం నిర్వహించారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యదర్శి , ఆయుష్ కమిషనర్ వి.రాములు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. స్కూల్ సీఈఓ దిలీప్‌కుమార్, ఎండీ జి.శశిరేఖ మాట్లాడుతూ పిల్లల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. చిన్నారి నక్షత్ర బృందం, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అడకమిక్ డైరెక్టర్ రేవతి మురుళీధర్ పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్

క్యాంప్ డే



పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విజ్డమ్ క్లబ్, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు తహసునీసాబేగం, ప్రిన్సిపల్ నారాయణమ్మ, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రాఘవాచారి, డాక్టర్ పోలి విద్యారెడ్డి, డాక్టర్ శిరీష, జోత్స్న, వినూత్న పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ

కబ్జాల రాజ్యం!



తిరుపతి చుట్టుపక్కల విలువైన ప్రభుత్వ భూములు కూటమి నేతల కబంధ హస్తాల్లో చిక్కుకుంటున్నాయి. కన్ను పడిన ప్రతి ఒక్కటీ కబ్జాకు గురవుతున్నాయి. ఖాళీగా కనిపిస్తే రాత్రికి రాత్రే ఆయా స్థలాలు చదునుగా మారిపోతున్నాయి. వారం తర్వాత చూస్తే అదే చోట శాశ్వత భవనాలు వెలుస్తున్నాయి. ప్రధానంగా పచ్చనేతల భూదందాకు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వివాదాలు సృష్టించి మరీ ఎకరాలకు ఎకరాలు స్వాహా చేస్తుండడంపై మండిపడుతున్నారు. పోలీసులు.. రెవెన్యూ అధికారుల అండతో ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. చివరకు కోర్టు కేసులు నడుస్తున్నా లెక్కచేయకుండా రెచ్చిపోతున్నారని విమర్శిస్తున్నారు. ఒక్క నెలలోనే తిరుపతి రూరల్ మండలంలో దాదాపు రూ.50 కోట్ల భూములను స్వాహా చేసేశారని వివరిస్తున్నారు.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

- ప్రభుత్వ భూములపై పచ్చ గద్దలు
- ఎకరాలకు ఎకరాలు స్వాహా
- కూటమి నేతల కబంధహస్తాల్లో రూ.కోట్ల స్థలాలు
- కన్నెత్తి చూడని పోలీసులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

తుమ్మలగుంట పంచాయతీ పరిధిలో..


తుమ్మలగుంట సర్వే నంబరు 18/2 ఆక్రమిత భూమిలో నిర్వహిస్తున్న మద్యం దుకాణం

తుమ్మలగుంట రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 18/2లో 0.76ఎకరాల బండి బాటను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి ఓ షెడ్డు నిర్మించాడు. అందులో కూటమి నేతలు తమ వారితో మద్యం దుకాణం ఏర్పాటు చేయించి ప్రతి నెలా రూ.లక్ష అద్దె వసూలు చేస్తున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.10కోట్లు ఉంటుందని సమాచారం.

రామానుజపల్లె పంచాయతీలో...


రామానుజపల్లె సర్వే నంబరు 121/5లో అక్రమంగా ఇంటి నిర్మాణాలు

రామానుజపల్లె రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 121/5లో 1.29ఎకరాల బండిబాటను స్థానిక టీడీపీ నేతలు కబ్జా చేసి రెండు ఇళ్లు నిర్మించారు. మరో భూమిలో కూడా నిర్మాణానికి యత్నిస్తున్నట్టు సమాచారం. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొత్తం భూమి విలువ దాదాపు రూ.15 కోట్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

పేరూరు పంచాయతీలో...

పేరూరు రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 529/4ఎలో 0.98ఎకరాలను కబ్జాదారులు దర్జాగా ఆక్రమించి చదును చేసేశారు. సదరు భూమి విలువ సుమారు రూ.20 కోట్ల పైమాటే!


పేరూరులో ఆక్రమిత భూమి

మల్లంగుంట పంచాయతీలో..


మల్లంగుంట సర్వే నంబరు 140లో కాలువను పూడ్చి ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్న ఆక్రమణ దారులు

మల్లంగుంట రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 140లోని 1.03ఎకరాల కాలువ భూమిలో అర ఎకరాను గ్రామానికి చెందిన టీడీపీ నేత కబ్జా చేసి, కాలువను పూడ్చి, ఏకంగా ప్రహరీ నిర్మిస్తున్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరినా చర్యలు శూన్యం. ఫలితంగా సుమారు రూ.2.5 కోట్ల విలువైన కాలువ భూమి హాంఫట్.

సి.మల్లవరం పంచాయతీలో..


సి.మల్లవరం సర్వే నంబరు 320లో చెరువు భూమిని చదును చేసిన అక్రమార్కులు

సి.మల్లవరం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 320లోని చెరువు తొట్టిని అదే పంచాయతీకి చెందిన గాంధీనగర్‌లో నివాసముంటున్న టీడీపీ నేతలు కబ్జా చేశారు. ఆ భూమి విలువ దాదాపు రూ.2 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. అయినప్పటికీ రెవెన్యూ అధికారుల్లో చలనం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఆక్రమణకు యత్నం

రామచంద్రాపురం మండలం చుట్టుగుంట రామాపురం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 34/3లో 5.16 ఎకరాల్లో తట్రావన గుంట ఉంది. ఆ చుట్టపక్కల విల్లాస్ నిర్మిస్తున్న ప్రైవేటు వ్యక్తులు గుట్టుగా ఆ గుంటను కాజేసినట్టు సమాచారం. పక్కనే ఉన్న తమ వెంచర్లకు సంబంధించిన సర్వే నంబర్లతో అడ్డదారిలో గుంట భూమిని రిజిస్ట్రేషన్ చేసి సగం ధరకు అమ్మేందుకు సన్నాహాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తట్రావన గుంటను పూడ్చి చదును పనులు చేస్తుండగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గుంటను ఆక్రమించిన అక్రమార్కులు ఒక అంకణం రూ.75 వేలు చొప్పున అమ్మేందుకు ప్రయత్నించడంతో వారి లెక్క ప్రకారం సుమారు రూ.50 కోట్లు విలువ చేస్తుందని వెల్లడిస్తున్నారు. అంతటి విలువైన భూమిని కాపాడాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ వెంకటరమణను వివరణ కోరగా.. తట్రవన గుంటను ఆక్రమణదారుల నుంచి కాపాడుతామని తెలిపారు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.


చదును చేసిన తట్రావానిగుంట

నోటీస్ బోర్డు

- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మార్కెట్, దుకాణాలకు వేలం.
- త్యాగరాజమండపంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అన్నమయ్య సంకీర్తనోత్సవాలు
- కేటీ రోడ్డులోని సప్తగిరినగర్, కమ్మ సంఘం హాల్‌లో ఉదయం 6 నుంచి ఇన్నర్ ఇంజినీరింగ్ సదస్సు
- మహతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి గ్లోబల్ ఐకాన్ స్కూల్ 6వ వార్షికోత్సవం వేడుకలు.
- చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో ఆదివారం అర్చక, పురోహితుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు.

పన్నులు చెల్లించాలని విన్నపం

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఇంటి, నీటి, డ్రైనేజీ, ఖాళీ జాగా పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ మౌర్య కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పన్నులను మూడు రోజుల్లోపు చెల్లించాలని సూచించారు. బకాయిలు చెల్లించకుంటే కొళాయి, కరెంట్ కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

8 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 8 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు.

పని ఒత్తిడిపై ఆవేదన


సమస్య వివరిస్తున్న కార్యదర్శులు

తిరుపతి అర్బన్ : సర్వేల కారణంగా ఇబ్బందిపడుతున్నామని, పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కొంత మందికి మాత్రమే సర్వే బాధ్యతలను అప్పగిస్తున్నారని, మరికొందరు మినహాయింపు ఇస్తున్నారని వాపోయారు. దేవేంద్రరెడ్డి స్పందిస్తూ సర్వే అంశాలపై పూర్తి సమాచారం సేకరించిన తర్వాత అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్వీయూలో 'సింపోజియం'


జ్యోతి ప్రజ్వలనలో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'క్రెడర్స్–2025' గోష్టి (సింపోజియం)ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించడంతోపాటు కొత్త నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సంద్ర అమరేంద్ర కుమార్, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు సుధారాణి పాల్గొన్నారు.

'సిద్ధార్థ'లో వర్క్‌షాప్ ప్రారంభం

తిరుపతి రూరల్ : మండలంలోని సి.గొల్లపల్లి వద్ద సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై నాలుగు రోజుల వర్క్‌షాపును శుక్రవారం ప్రారంభించారు. బ్రిహాసు సాఫ్ట్‌వేర్ ప్రయివేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో×మెషీన్ లెర్నింగ్ అండ్ ఏఐ పైథాన్₹₹ అన్న అంశంపై అధ్యాపకులు, నిపుణులు చర్చించారు. రీసోర్స్‌పర్సన్‌గా నితిస్‌కుమార్, డాక్టర్ నీలిమ వ్యవహరించగా ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, విభాగాధిపతులు సుజీత్, నారాయణబాబు, కో–ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

కవర్‌తో మామిడి కళకళ

చంద్రగిరి : మామిడి కాయలకు కవర్లు కడితే నాణ్యంగా ఉంటాయని మండల ఉద్యానశాఖ అధికారి శైలజ తెలిపారు. శుక్రవారం తొండవాడకు చెందిన వెంకటరామిరెడ్డి అనే రైతు మామిడి తోటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ టేబుల్ రకాలైన బేనిషా, మల్లిక, రసాలు, పెద్ద నీలం, నీలం, ఖాదర్, హిమాయత్ పసంద్, కలర్ తోతాపురికి ఫ్రూట్ కవర్స్ కట్టాలని సూచించారు. దీంతో మంగు, టెంక పురుగు, ముడ్డి పుచ్చు పురుగు, పండు ఈగ, తెగుళ్లు, ఎండ తీవ్రత, వడగండ్ల వాన నుంచి కాయలను రక్షణ ఉంటుందని వివరించారు. కాయ పరిమాణం మేరకు 4 రకాల ఫ్రూట్ కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఎకరాకు రూ. 4వేలు, గరిష్ఠంగా 2.5 ఎకరాకు రూ.10వేల రాయితీ కూడా ఇస్తోందని వెల్లడించారు. ఆసక్తి గలవారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు లత పాల్గొన్నారు.


కవర్లు పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

ఆర్టీసీ స్థలం ఆక్రమణకు చెక్

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని ఖాళీ స్థలంపై ఓ బడా నేత అనుచరుడి కన్ను పడింది. అనుకున్నదే తడవుగా ఆ స్థలంలో సదరు అనుచరుడు చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసేందుకు యత్నించాడు. శుక్రవారం ఈ విషయం ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఆ సథలాన్ని జేసీబీ సాయంతో చదును చేయించారు. మళ్లీ ఎవరూ ఆక్రమణకు పాల్పడకుండా ఆ స్థలంలేఓ ప్రహరీ గోడ నిర్మించాలని నిర్ణయించారు.


స్థలం చదును చేయిస్తున్న ఆర్టీసీ అధికారులు

అన్నమయ్యకు స్వర నీరాజనం


సుకన్య రాంగోపాల్ బృందం ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : సంగీత విద్వాంసురాలు సుకన్య రాంగోపాల్ వినూత్న రీతిలో ఘటాలతో అన్నమయ్యకు స్వర నీరాజనాలు సమర్పించారు. శ్రీత్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో చేపట్టిన అన్నమయ్య సంకీర్తనోత్సవాలు శుక్రవారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు సునక్య రాంగోపాల్ సంకీర్తనలాపన సాగింది. వీరికి గాత్రంతో విద్యారామ్‌నాథ్, వేణువుపై వాణి మంజునాథ్, వీణపై లత నిక్షిత్, మృదంగంపై లక్ష్మీ రాజశేఖర్ అయ్యర్, మోర్సింగ్‌పై భాగ్యలక్ష్మి,ఎం.కృష్ణ చక్కటి సహకారం అందించారు. పతంగి బ్రదర్స్ దాత్రే పతంగి, ధ్రువ్ పతంగి ప్రదర్శించిన గాత్ర కచేరీ ఆకట్టుకుంది. వీరికి వయోలిన్‌పై అభిజిత్ నరసింహన్, మృదంగంపై అశ్విన్ శ్రీధరన్ సహకరించారు. అనంతరం కళాకారులను ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన సుందరం, కంచి రఘురామ్ సత్కరించారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరించారు. సిరులతల్లి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ట్రైసైకిళ్లు, పుష్‌కార్ట్స్ వితరణ

తిరుపతి కల్చరల్: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ టెట్రా ప్యాక్ సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్‌కు శుక్రవారం రూ.3 లక్షలు విలువ చేసే పుష్ కార్ట్స్ అందజేశారు. నగరంలో పారిశుద్ధ్య మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు మరో 15 పుష్‌కార్ట్స్‌ను వారం రోజులలో అందజేస్తామని డీబీఆర్‌సీ ప్రతినిధులు తెలిపారు.. అలాగే యూత్‌హాస్టల్లో కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్, డిప్యూటీ కమిషనర్ ఎస్.అమరయ్య చేతుల మీదుగా రూ.3.5 లక్షలు విలువైన ట్రైసైకిళ్లు, ఫోర్ వీలర్ పుష్ కార్ట్స్‌ను 23 మంది కార్మికులకు పంపిణీ చేశారు. టెట్రా ప్యాక్ ప్రతినిధి కమలేష్, డీబీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అలాడి దేవకుమార్, ప్రోగ్రామ్ డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ అనిల్‌కుమార్, సభ్యులు తేజశ్రీ, ఉదయ్, రవితేజ, రాజశేఖర్, మునిలత పాల్గొన్నారు.


పుష్ కార్ట్స్ అందిస్తున్న టెట్రా ప్యాక్, డీబీఆర్‌సీ ప్రతినిధులు